క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో మేలుకొలుపులు



చూచుకొండలో మేలు కొలుపులో భక్తులు

మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో మేలుకొలుపుల కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ధనుర్మాసంలో భాగంగా గత నెల 16న ప్రారంభమైన మేలుకొలుపుల కార్యక్రమం నిర్విరామంగా సాగుతుంది. భోగి రోజున మేలుకొలుపుల కార్యక్రమం ముగుస్తుంది. చూచుకొండలో వందలాది మంది భక్తులు తెల్లవారు నిద్రలేచి చన్నీటి స్నానమాచరించి భజనలు చేసుకుంటూ పాటలు పాడుతూ గ్రామంలో దేవాలయాలకు వెళ్లి దేముళ్లను నిద్రలేపుతూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు. భోగిరోజున మునగపాక, చూచుకొండ గ్రామాల్లో భారీ అన్న సమారాధనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వాడ్రాపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

మునగపాక : ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. వాడ్రాపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో సీఎం జగన్ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు.

నేడు పి.ధర్మవరంలో 'గడప గడపకు'

ఎస్.రాయవరం : పి.ధర్మవరం సచివాలయంలో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరవుతున్నట్టు చెప్పారు. మండల అధికారులు అందరూ హాజరు కావాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శుల నియామకం

మునగపాక : మండలంలోని రెండు పంచాయతీలకు కార్యదర్శుల నియామకం జరిగిందని ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. పల్లపు ఆనందపురం పంచాయతీకి ఎండీ షమీహ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమె పాయకరావుపేట మండలం ఈదడం పంచాయితీ నుంచి రాగా గణపర్తి పంచాయతీ కార్యదర్శిగా పి.షణ్ముకరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

అంగన్‌వాడీల ఆందోళన

మునగపాక : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు.ఈ ,సందర్భంగా సీఐటీయూ నేతలు శ్రీనివాసరావు, బ్రహ్మాజీలు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పనికి తగ్గ వేతనం అందించేలా చూడాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలవుతున్న మెనూకు సంబంధించి సరకుల ధరలు పెంచాలన్నారు. పర్యవేక్షణ పేరుతో వేధింపులు నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శాస్త్రీయ సలహాలు పాటిస్తే మేలైన దిగుబడులు



మర్రిపాలెంలో రబీ వరిపైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ గౌరి

రాంబిల్లి : శాస్త్రీయ సలహాలు పాటిస్తూ సాగు చేస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చునని డాట్ శాస్త్రవేత్త డాక్టర్ గౌరీ అన్నారు. మర్రిపాలెంలో మంగళవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం రబీ వరిపైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో సి. సుమంత, ఏఈవో ప్రసాద్, ఎంపీఈవో, వీఏఏలు పాల్గొన్నారు.

టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం

మునగపాక : టీడీపీ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆ పార్టీ అనకాపల్లి జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు కోరారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 18న మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించడంతో పాటు గ్రామాల్లో టీడీపీ బలోపేతం కోసం పాటుపడాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

జనరంజకంగా జగనన్న పాలన



గడప గడపకు కార్యక్రమంలో చిన్నారిని ఎత్తుకున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : రాష్ట్రంలో అవినీతి లేని పరిపాలన అందించడంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరికే సాధ్యమైందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు.పీ.ధర్మవరం గ్రామంలో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కరపత్రాలు అందుకున్న లబ్ధిదారులతో మాట్లాడారు. అమ్మా ఈ కరపత్రంలో ముద్రించిన నగదు పూర్తిగా మీకు అందిందా ...ఏమయినా ఆటంకాలు ఏర్పడ్డాయా అని ప్రశ్నించారు .ఈ మేరకు ఎమ్మెల్యేతో లబ్ధిదారులు మాట్లాడుతూ కరపత్రాల్లో వచ్చిన నగదుతో పాటు వీధుల్లో తలెత్తే సమస్యలు పరిష్కారంలోనూ గ్రామ వలంటీర్లు చొరవ చూపిస్తున్నారని, ఏ చిన్న సమస్య వచ్చినా అందుబాటులో ఉన్న వలంటీర్‌కు చెప్పుకుంటున్నామని తెలిపారు. జనరంజకమైన పాలన అందిస్తూ అందరి హృదయాల్లో సీఎం నిలిచారని కొనియాడారు.

ఈ క్రమంలో గ్రామంలో కనిపించిన చిన్నారులను ఎమ్మెల్యే ఎత్తుకుని ముద్దాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి, ఎంపీపీ కోన లోవలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెదుళ్ల బంగారి, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, దోసపాత్రుని సందీప్‌కుమార్, మైలారు శ్రీనివాస్‌రావు, సోషల్‌మీడియా కన్వీనర్ చేపల రాజు, కొర్ని రాజారమేష్, మాణిక్యం, కర్రి శ్రీను పాల్గొన్నారు.

గజవాహనంపై తిరువీధి సేవ



గజవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం



పుష్పతోటలో గోదాదేవి అమ్మవారికి ఆరాధనలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : ఉపమాక క్షేత్రంలో ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం గజవాహనంపై స్వామివారి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. చిన్నపల్లకిలో గోదాదేవి అమ్మవారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మాఢవీధుల్లో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అంతకు ముందు స్వామివారి మూలవిరాట్‌కు కింద దిగువన ఉన్న ఆలయాల్లో నిత్యార్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు జరిగాయి. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 26వ పాశురాన్ని విన్నపం చేశారు. పుష్పతోటలో గోదాదేవి అమ్మవారికి ఆరాధనలు జరిపారు. గజవాహనంలో స్వామివారిని, పల్లకిలో అమ్మవారిని ఉంచి తిరువీధి సేవలు నిర్వహించారు.

నర్సింహరావును అభినందించిన ఎమ్మెల్యే



నర్సింహరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే గొల్లబాబూరావు

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత సిహెచ్.నర్సింహరావును ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మంగళవారం అభినందించారు. నర్సింహరావుకు 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 81 వ సంవత్సరంలోనికి అడుగు పెడుతున్నందున నర్సింహరావు స్వగృహానికి వెళ్ళి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పూలమాల వేసి అభినందించారు. ఎమ్మెల్యేతో పాటు ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను తదితరులు వున్నారు.

ప్రమాదానికి గురైన వ్యక్తికి ఎమ్మెల్యే పరామర్శ



మంచాల చిట్టిబాబును పలకరిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : మండలంలో గల ఎస్.నర్సాపురం గ్రామానికి చెందిన మంచాల చిట్టిబాబును ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పలకరించారు. చిట్టిబాబు రైలు దిగుతుండగా జరిగిన ప్రమాదంలో రెండు కాళ్ళు ప్రమాదానికి గురయ్యాయి. చిట్టిబాబును పలకరించి, ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, పార్టీ పట్టణ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ నాయకులు కేశనకుర్తి సత్తిబాబు, చోడిపల్లి శ్రీను పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతంపై తిమ్మరాజుపేటలో ప్రచారం



గ్రంథాలను ప్రదానం చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): సుఖ భోగాలను విడిచిపెట్టి కర్మలను కాల్చి వేసే విధానమే భోగిమంటలు అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అనకాపల్లి కమిటీ సభ్యులు కె. త్రినాథరావు, శ్రీనివాసరావు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని తిమ్మరాజుపేటలో వారు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కె.పోలినాయుడు, శివ, బి.అప్పలనాయుడు, సురేశ్, భవానీ, రాజు, లక్ష్మి పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ వలంటీర్లకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ ఆర్.కె.కుమార్

పాయకరావుపేట : పట్టణంలోని గల ఐ ఓపెనర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో విలేజ్ హెల్త్ వలంటీర్లకు రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతులు మంగళవారం ముగిసాయి. వైద్య సదుపాయాలు అందుబాటులో లేని గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ప్రాథమిక చికిత్సను అందించాలనే అంశంపై సంస్థ డైరెక్టర్ డాక్టర్ డేవిడ్ మూర్ హెల్త్ వలంటీర్లకు అవగాహన కల్పించారు. ప్రజలందరికీ ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించేందుకు హెల్త్ వలంటీర్లు కృషి చేయాలని సూచించారు. వలంటీర్లకు ప్రాథమిక చికిత్సకు అవసరమైన హెల్త్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా దేశానికి చెందిన గే మూర్, డాక్టర్ ఫిబే మొకంజీ, డాక్టర్ నిర్మల, రెవ.జాన్ డేవిడ్, ఐ ఓపెనర్స్ మినిస్ట్రీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంపద కేంద్రాల ద్వారా ఆదాయం రాబట్టాలి



మునగపాక సంపదతయారీ కేంద్రాన్ని సందర్శిస్తున్న నాగలక్ష్మి

మునగపాక : సంపదతయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని సంపద తయారీ కేంద్ర నిర్వహణ కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి అన్నారు. మునగపాకలోని సంపద తయారీ కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాల నిర్వహణ పై దృష్టి సారించాలన్నారు. పాలకులు, అధికారులు కేంద్రం ద్వారా ఆదాయం వచ్చేలా పాటుపడాలన్నారు. మునగపాక సంపద తయారీ కేంద్రం ద్వారా ఎంతమేర ఆదాయం సమకూరిందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో మునగపాక సంపద తయారీ కేంద్రం వద్ద జిల్లాకు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తున్న సంపద తయారీ కేంద్రం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేస్తూ సర్పంచ్ దిమ్మల అప్పారావు కృషిని అభినందించారు. ఆమె వెంట ఈవోఆర్డీ ఈశ్వరరావు, సచివాలయ కార్యదర్శి శివ పాల్గొన్నారు.

14 నుంచి క్రికెట్ పోటీలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పరి

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్టు సర్వేజన వేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరి అన్నారు. మంగళవారం మైదానంలో కప్ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు.

జోరుగా వరి నూర్పులు



యండపల్లిలో వరి నూర్పు చేస్తున్న రైతులు

కోటవురట్ల: మండలంలో వరి నూర్పులు జోరుగా సాగుతున్నాయి. సంక్రాంతి పండగ ముందే ఫలసాయాన్ని ఇంటికి చేర్చాలన్న తపనతో రైతులు ఉత్సాహంగా పొలం పనులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మండలంలో 1700 హెక్టార్లలో వరి సాగు జరిగింది. నాట్లు వేసిన నాటి నుంచి వాతావరణం అనుకూలించడంతో ఎటువంటి నష్టం వాటిల్లకుండా అధిక దిగుబడులు వచ్చాయి. తుపానుల బెడదను కూడా దాటి మంచి దిగుబడులను సాధించారు. ప్రస్తుతం జల్లూరు, యండపల్లి, కోటవురట్ల, కొడవటిపూడి, కె.వెంకటాపురం, రామచంద్రపురం, రాజుపేట తదితర గ్రామాలలో చురుగ్గా వరి నూర్పులు జరుగుతున్నాయి. ట్రాక్టర్లకు గాలి పంకాలు ఏర్పాటు చేసి ఎగరబోత నిర్వహిస్తున్నారు. సంక్రాంతికి ధాన్యపు రాశులు ఇంటికి చేర్చాలన్న భావనతో ఉత్సాహంగా పొలం పనులు చేపడుతున్నారు.

నృత్య ప్రదర్శనలో యలమంచిలి విద్యార్థినుల ప్రతిభ



బహుమతులు పొందిన గీతశ్రీ, వాహిని ప్రియ

యలమంచిలి : సంక్రాంతి సంబరాల్లో భాగంగా రాజమండ్రి ఆనం కళాక్షేత్రంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ వారు నిర్వహించిన నృత్య ప్రదర్శనలో యలమంచిలి పట్టణానికి చెందిన పి.గీతాశ్రీ, డి.వాహిని ప్రియ ప్రతిభ కనబరిచారు. రాష్ట్రంలో నృత్య కళాకారులు అందరూ పాల్గొన్న ఈ పోటీలలో యలమంచిలి విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన గీతాశ్రీ, వాహిని ప్రియకు రూడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. యలమంచిలి పట్టణంలో విద్యార్థులు ఈ నృత్య ప్రదర్శనలో బహుమతులు సాధించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కళాకారులు అభినందించారు.

మంత్రి అమర్‌ను కలిసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్



ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగదీష్

మునగపాక : విశాఖ జిల్లాకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన మునగపాక మండలం గంగాదేవిపేటకు చెందిన కాండ్రేగుల జగదీష్ మంగళవారం ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సెషన్స్ జడ్జి కోర్టు పీపీగా నియమితులైన జగదీష్‌ను పలువురు అభినందిస్తున్నారు. దీనిలో భాగంగా అమర్‌నాథ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో జగదీష్ సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని అమర్‌నాథ్ ఆకాంక్షించారని జగదీష్ తెలిపారు.

కూడార్రై ఉత్సవం నేడు

కశింకోట : కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం ×కూడారై×ఉత్సవాన్ని నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 27వ రోజున కూడారై పాశురం పఠించి, ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. గోదాదేవిని వివాహం చేసుకోవడానికి రంగనాథుడు అంగీకారం తెలిపిన రోజుగా కూడారై ఉత్సవాన్ని జరపనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, విష్ణు సహస్రనామార్చన నిర్వహిస్తారు. బెల్లం, పంచదారలతో వేర్వేరుగా రెండు పెద్ద పాత్రల్లో పాయసం తయారు చేసి, సంప్రదాయ పూజలు చేసి ప్రజలకు ప్రసాదంగా పంపిణీ చేస్తారు. కూడారై ఉత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేశామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా..

- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- వైఎస్సార్ సీపీలోకి చేరిన టీడీపీ వార్డు సభ్యులు



టీడీపీ వార్డు సభ్యునికి కండువా వేసి వైఎస్సార్ సీపీలో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): మూడేళ్ల జగనన్న పాలనలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందించగలిగామని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తి రాజు (కన్నబాబురాజు) అన్నారు. అచ్యుతాపురం మండలంలోని చోడపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ తిరిగి నవరత్నాల పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానికుల బాగోగులను తెలుసుకున్నారు. ఎవరికైనా పథకాలు అందకుంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. పథకాల లబ్ధిలో ఎటువంటి రాజకీయాలు ఉండవని తెలిపారు. అందరికీ ఇళ్లు, ఆసరా లేని వారికి పింఛన్లు అందజేయడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. వలంటీర్ల ద్వారా ఇంటింటి స్థితి గతులపై ఆరా, సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని రకాల సేవలు అందిస్తున్నామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు

టీడీపీకి చెందిన కాకి అప్పారావు, వడిశెల శంకర్‌రావులు ఎమ్మెల్యే కన్నబాబురాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే వద్దకు వెళ్లిన వారు అధికార పార్టీ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వలంటీర్లకు వాటర్ ప్రూఫ్ బ్యాగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, ఎంపీపీ భర్త కోన బుజ్జి, సర్పంచ్ గండిబోయిన వెంకట్, ఎంపీటీసీ లాలంశ్రీను, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు పాల్గొన్నారు.

చలపతిరావు సేవలు ఎనలేనివి



చలపతిరావు చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : దివంగత బీజేపీ నేత పి.వి చలపతిరావుకు అచ్యుతాపురం బీజేపీ శాఖ మంగళవారం నివాళులు అర్పించింది. ఈ మేరకు మండల బీజేపీ కార్యాలయంలో యలమంచిలి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు పి.వి. చలపతిరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ పార్టీ అభివృద్ధికి నిస్వార్థంగా పని చేసిన నేత చలపతిరావు అని కొనియాడారు. అచ్యుత విద్యా సంస్థల అధినేత పల్లెల శేషగిరి, ప్రశాంతి విద్యా సంస్థల అధినేత ధర్మరెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు నేతగా ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. మండల బీజేపీ అధ్యక్షుడు రాజాన రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజాన భాస్కర్‌రావు, మేరుగు కాసుబాబు, దొడ్డి వెంకట సత్యనారాయణ, పిట్టా దాసుబాబు, ఉమ్మిడి వెంకటేశ్వర్లు, అగ్గాల హనుమంతరావు, ఇబ్రహీం భాషా, బండారు కన్నంనాయుడు, రాజాన చిట్టిబాబు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



ప్రైవేటు కళాశాలలో సంక్రాంతి సంబరాలు



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

మునగపాక : మునగపాకలోని నేషనల్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి వేడుకలు, ముగ్గుల పోటీలు, కృష్ణుని పూజ, ఉట్టుకొట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ సంజీవరావు, ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, ప్రగతి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వేగి శ్రీనివాసరావు, డైరెక్టర్లు గీత, మహేష్, శంకరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన సీడీపీవో



మునగపాకలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శిస్తున్న సీడీపీవో శ్రీలత

మునగపాక : అంగన్‌వాడీ సేవలను సక్రమంగా అందించాలని సీడీపీవో శ్రీలత కోరారు. మంగళవారం ఆమె మునగపాకలోని పూర్వపు హాస్టల్‌లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎంతమంది పిల్లలు కేంద్రానికి వస్తున్నారు. అలాగే బాలింతలు, గర్భిణుల సంఖ్యకు సంబంధించిన రిజిస్టర్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే వారికి మెరుగైన సేవలందించాలన్నారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు.ఆమె వెంట అంగన్‌వాడీ టీచర్ హేమలత పాల్గొన్నారు.

దివ్యాంగులకు ముఖ్యమంత్రి చేయూత



ఎమ్మెల్యే కన్నబాబురాజును కలిసిన దివ్యాంగురాలు వాణీ కుటుంబసభ్యులు

యలమంచిలి : ఇటీవల యలమంచిలి పట్టణానికి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి పట్టణానికి చెందిన మానసిక దివ్యాంగురాలు వాణీ సమస్యను తీసుకెళ్లి రూ.లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేయించిన ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు రాజు)ను వాణీ తల్లిదండ్రులతో కలసి మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబురాజు మట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దివ్యాంగులకు విద్య,ఉద్యోగ పరంగా అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అధిక శాతంతో పింఛన్లు మంజూరు చేశారని, మానసికంగా దృఢ సంకల్పంతో దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం ఎప్పుడూ వెన్నంటే ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక కొత్తపేట పాఠశాలలో చదువుతున్న వాణీకి ముఖ్యమంత్రి సహాయం చేయడం పట్ల ఉపాధ్యాయ బృందం సభ్యులు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుడు విశ్వేశ్వరావు పాల్గొన్నారు.

యోగా, ఆయుర్వేదంతో వ్యాధి నిరోధక శక్తి

కశింకోట : పిల్లలకు చిన్నప్పటి నుంచి ఆయుర్వేదిక్ వైద్యం అందించడం పట్ల తల్లిదండ్రులు దృష్టి సారించాలని కస్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి వైద్యాధికారి కె.లావణ్య కోరారు. మండలంలోని కస్నూరుపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్య విధానం, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుర్వేదం దేశీయ వైద్య విధానమని, దీనివల్ల సైడ్ ఎఫెక్టులు ఉండవన్నారు. విదేశీయులు సైతం ఆయుర్వేదం పట్ల ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులను పరీక్షించి వ్యాధి నిరోధక మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యానికి ఉపయోగపడే యోగాపై చిన్నారులకు అవగాహన కలిగించారు. వారితో యోగాసనాలు వేయించారు. రోజూ పిల్లలతో ఆసనాలు వేయించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.

పేరుకుపోతున్న చెత్త..



కోటవురట్లలోని తుపాకుల గెడ్డ వంతెన కింద పేరుకుపోయిన చెత్త

కోటవురట్ల: మండల కేంద్రంలోని తుపాకుల గెడ్డ చెత్తతో నిండిపోతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో పెద్ద యెత్తున చెత్త, ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోయాయి. స్థానికంగా ఉన్న వర్తకులు చెత్తను తీసుకొచ్చి తుపాకుల గెడ్డలో వేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. భారీగా చెత్త, ప్లాస్టిక్ పేరుకుపోవడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాలు చుట్టుముడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.